క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలను అందించనున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 9, 10 తరగతి చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్ డిప్లొమో, డిగ్రీ, పీజీ చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ ద్వారా అక్టోబర్ 31లోగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0884–2352303 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

దోమల నివారణే లక్ష్యం



సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, బృందం

కాకినాడ క్రైం: దోమల నివారణే లక్ష్యం అందరూ పనిచేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.విల్సన్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దోమల నివారణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దోమల సంతాన ఉత్పత్తికి దోహద పడే లార్వా ప్రదేశాలను గుర్తించి సమూలంగా నాశనం చేయడం ద్వారా దోమల ఉధృతిని నివారించగలమన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందని తెలిపారు. అంతకు ముందు మలేరియా దోమల వల్ల వస్తుందని గుర్తించిన ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి డీఎంహెచ్‌వో, బృందం పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కె.సుబ్బరాజు, డీఎల్ఏటీవో డాక్టర్ ప్రభాకర్, ఆర్‌బీఎస్‌కే ఎస్‌సీడీ పీవో డాక్టర్ అరుణ, ఎఫ్ఆర్‌టీసీ ఎంవో డాక్టర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఇస్కాన్ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులు

బాలాజీచెరువు: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల సందర్భంగా కాకినాడ ఇస్కాన్ నిర్వహించిన పోటీలలో ఆదిత్య స్కూల్ అశోక్ నగర్ బ్రాంచి విద్యార్థులు ప్రతిభను కనబరచారు. ఈ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని ఎ.లక్ష్మీప్రియ వ్యాసరచనలో మొదటి బహుమతి, నృత్య ప్రదర్శనలో రెండో బహుమతి అందుకున్నారు. ఎల్‌కేజీ వి.భార్గవ్ వేషధారణ పోటీలో మొదటి బహుమతి, 4వ తరగతి కె.అక్షయ పాట్ మేకింగ్ పోటీలో రెండో బహుమతి, 4వ తరగతి కె.రాధ, ఒకటో తరగతి డి.సుమేధ చిత్రకళ పోటీలో కన్సొలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. ఆదిత్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ ఎ.శృతి రెడ్డి విజేతలను అభినందించారు. పాఠశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే ఆరు బహుమతులు గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సహాయ సహకారాలను అందించిన ఇస్కాన్ వలంటీర్ ఎల్.రమకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాఠశాలకు మోటార్ బహూకరణ


తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మోటరు లేక విద్యార్థుల తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పలువురు సమస్యను తీర్చేందుకుగాను దాతల సహకరంతో ముందుకు వచ్చారు. బుధవారం విద్యుత్ మోటార్‌ను స్థానిక నాయకులు పాఠశాల సిబ్బందికి అందించారు. సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టిక్లపూడి నాగేశ్వరరావు, నాయకులు గుంటముక్కల సూరిబాబు, సుంకర రామచంద్రరావు, కొమ్మిరెడ్డి బద్రి, మర్రి అశోక్, గుంటముక్కల విష్ణు, సిబ్బంది అలీషా, సునీల్ పాల్గొన్నారు.

పారదర్శక సేవలు

తాళ్లరేవు: సహకార పరపతి సంఘాలలో సేవలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం ద్వారా రైతులకు పూర్తిపారదర్శక సేవలు అందనున్నాయని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తెలిపారు. బుధవారం ఆయన తాళ్లరేవు సహకార పరపతి సంఘాన్ని సందర్శించారు. ఇటీవల సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన విల్ల ఆదినారాయణను అభినందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 295 సొసైటీలకు గానూ సుమారు 7 వేల కోట్ల టర్నోవర్ చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.1,600 కోట్ల ఫైబిడి డిపాజిట్‌లు, రూ.700 కోట్లు బంగారంపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పలు సొసైటీల్లో గతంలో కొన్ని తప్పులు జరిగాయని, ఆ కారణంగా సేవలన్నింటినీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ధూళిపూడి మోహన్, నాయకులు మోపూరి రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్.. పబ్లిక్ సేఫ్..

- కాకినాడ నగరంలో జరుగుతున్న కార్డన్ సెర్చ్
- శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా తనిఖీలు
- ప్రజల్లో గందరగోళం
- భయపడొద్దంటున్న పోలీసులు



కార్డన్ సెర్చ్‌లో పోలీస్ పహరా

కాకినాడ క్రైం: నగరంలో కార్డన్ సెర్చ్‌లు జరుగుతున్నాయి. తరచూ చేపడుతున్న ఈ తనిఖీల వల్ల నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ సాధ్యమవుతోందని పోలీసులు అంటున్నారు. అయితే ఒకేసారి గుంపుగా పోలీసులు రావడం, తమ ప్రాంతాలను చుట్టుముట్టి ఇళ్లల్లోకి వెళ్లి సోదాలు చేయడం, వాహనాలు తనిఖీలు, అనుమానితుల్ని ప్రశ్నించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆరా తీయడం వంటివి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో ఇదో ప్రక్రియ అని పోలీసులు చెబుతున్నా ప్రజల్లో మాత్రం భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు కార్డన్ సెర్చ్ అంటే ఏంటీ, ఎందుకు చేస్తారు, ఎలా చేస్తారు, ప్రయోజనం ఏంటీ అన్న అంశాలతో పాటు కాకినాడ నగరంలో చేపడుతున్న కార్డన్ సెర్చ్ వల్ల చేకూరిన ప్రయోజనాలను వివరిస్తూ సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం

కార్డన్ సెర్చ్‌కు ఎందుకంటే..

ఓ ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా చుట్టుముట్టి నిర్ణీత సమయంలోపు ఎవరినీ బయటకి వెళ్లకుండా, బయటి వారిని లోపలికి రానివ్వకుండా ఇళ్లు, భవనాలు, వాహనాలను తనిఖీ చేస్తారు. నేరస్తులు, సంఘ విద్రోహ శక్తుల్ని గుర్తించడం, అక్రమ వస్తువులు, ఆయుధాలను గుర్తించడం, అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టడం, మాదక ద్రవ్యాల నివారణ, శాంతి భద్రతల పర్యవేక్షణకు ఈ కార్డన్ సెర్చ్‌ని చేస్తారు.

తనిఖీలు ఇలా..

కార్డన్ సెర్చ్ నిర్వహించేందుకు ఓ నిర్దిష్ట ప్రక్రియ ఉంది. ముందు నేర కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తిస్తారు. తెల్లవారు జామున లేదా రాత్రి వేళల్లో ఎక్కువగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తారు. నిర్ణీత ప్రాంతాలను పోలీసులు చుట్టుముడతారు. వీరు బృందాలుగా విడిపోయి ఇళ్లు, దుకాణాలు, వాహనాల తనిఖీ చేస్తారు. అనుమానాస్పద వస్తువులు ఉంటే వెతుకుతారు. ఇళ్లల్లోని వ్యక్తుల గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తారు. పాత నేరస్తులు, అనుమానితుల వివరాలను ఆరా తీస్తారు. పరిశీలన, తనిఖీ కోసం పలు వస్తువులు స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానం ఉన్న వ్యక్తుల్ని అరెస్టు చేసే హక్కు ఉంటుంది. సెర్చ్ పూర్తయిన తర్వాత తిరిగి ఆయా ప్రాంతాలలో యథా స్థితిలో జనజీవనం కొనసాగుతుంది.



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఏఎస్‌పి దేవరాజ్

మూడు నెలల్లో ఏడు సెర్చ్‌లు

కాకినాడ, పరిసర ప్రాంతాల్లో మూడు నెలల్లో ఏడు కార్డన్ సెర్చ్‌లు నిర్వహించారు. ఆగస్టు 6, 10 తేదీల్లోను, జూలైలో 18, 20 తేదీల్లోను, జూన్ 13న, మేలో 14, 25 తేదీల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 93 మందిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. తగిన రికార్డులు లేని 117 వాహనాలను సీజ్ చేశారు. పలువురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నారు. అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పలువురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని దొంగతనాలు నేర పూరిత చర్యల ప్రణాళికలు స్వాధీనం చేసుకున్నారు. నేరాలు జరగకుండా ఆపగలిగారు. గంజాయి క్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టురట్టు చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. పలు వ్యభిచార కార్యకలాపాలు నిలువరించారు. ఇలా కార్డన్ సెర్చ్ ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో తరచూ ఈ తనిఖీలు నిర్వహించడానికి అధికారులు మొగ్గు చూపుతున్నారు. కాకినాడలో ఏఎస్పీ దేవ రాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రజలు భయపడొద్దు



ప్రజలు తమ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ జరిగితే కంగారు పడొద్దు. కార్డన్ సెర్చ్ లక్ష్యాన్ని తెలుసుకోవాలి. తనిఖీలు చేస్తున్న పోలీసులకు సహకరించాలి. నేర ప్రవృత్తి లేని ఏ ఒక్కరికీ పోలీస్ చర్యల వల్ల ఎలాంటి హాని ఉండదు. కార్డన్ సెర్చ్‌లు నిర్వహించడం వల్ల నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ జరుగుతుంది. జరగబోయే నేరాల నియంత్రించవచ్చు. తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలోనే చేస్తున్నాం. నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలనే కార్డన్ సెర్చ్‌కు ఎంచుకుంటున్నాం. ఈ తనిఖీలు సత్ఫలితాలిస్తున్నాయి.
– దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఎస్పీ, కాకినాడ

కన్నబాబుకు పలువురి పరామర్శ



వైద్యనగర్‌లో కురసాల సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబును బుధవారం పలువురు పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందిన సంగతి విదితమే. వైద్యనగర్‌లోని కన్నబాబు నివాసంలో సత్యనారాయణ చిత్రపటానికి దేవినేని అవినాష్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో ఆర్డినేటరు దవులూరి దొరబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి దీప్తి, మద్దాల అను, బొబ్బిలి భాస్కర్, కురుమళ్ళ ఆంజనేయులు, ఉత్తరాంధ్ర జిల్లాలు, రాయలసీమ తదితర జిల్లాల నుంచి పలువురు వచ్చి నివాళులర్పించారు. కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేడు అమరావతి చాంపియన్‌షిప్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే అమరావతి చాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలు గురువారం డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ బుధవారం తెలిపారు. అండర్–22 పురుషులు, మహిళల విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్ పాట్నర్ వినోద్

కాకినాడ సిటీ: హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్ పాట్నర్ డి.వినోద్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న ఎరైజ్4యూ ప్రోగ్రాం ద్వారా జరగబోయే శిక్షణా కార్యక్రమాలను వివరించారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను, ఇన్నోవేటివ్ ఐడియాలజీ ద్వారా వివిధ ప్రాజెక్టులను తయారు చేయడానికి హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహిస్తున్న ఎరైజ్4యూ ప్రోగ్రామ్ ద్వారా 40 రోజుల పాటు శిక్షణ ఇస్తుందన్నారు. ఈ శిక్షణకు ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ ప్రోగ్రామ్ ప్రచారంలో భాగంగా వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: విద్యుత్ వార్షిక మరమ్మతుల కారణంగా 33/11కేవీ వలసపాకల విద్యుత్ సబ్–స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలసపాకల,గంగరాజు నగర్ రోడ్–1 నుంచి 6 వరకు, కృష్ణ టెంపుల్, సింహాద్రి నగర్ ఏరియా, గానుగచెట్టుసెంటర్, శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్, కాకినాడ పబ్లిక్ స్కూల్, వీఎస్‌లక్ష్మి కాలేజీ ఏరియా, బొంద గుంట, మాణిక్య నగర్, నాగార్జున బ్యాంకుకాలనీ, పద్మ నగర్, ఇన్కమ్ టాక్స్ కాలనీ, ఎస్ఆర్ఎంటీ గెస్ట్ హౌస్ ఏరియా, సంతోష్ నగర్, ఈశ్వర్ నగర్, రామకృష్ణ నగర్, వాకలపూడి థియేటర్ ఏరియాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బోట్‌క్లబ్: కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈ ఎస్ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్నాథపురం, గోలీలపేట, కెనాల్ రోడ్డు, ఉమెన్స్ కళాశాల రోడ్డు, రాజీవ్‌గృహ కల్ప, రంపం విల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హమ్మయ్య.. గోతులు పూడ్చారు

పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్ వద్ద గోతుల బాధకు విముక్తి

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ రూరల్: కాకినాడ–పిఠాపురం మార్గంలో వాహనదారులకు రాయుడుపాలెం జంక్షన్ వద్ద గోతులు బాధను నుంచి విముక్తి లభించింది. ×అటుగా ప్రయాణం.. నరకం‡ శీర్షికన ఈనెల 15వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారుల్లో కదలిక వచ్చింది. రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గొయ్యిలను పూడ్చారు. వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


అటుగా ప్రయాణం.. నరకం

సాక్షిలో ఈనెల 15న ప్రచురితమైన కథనం



గోతులు పూడ్చక ముందు దుస్థితి



పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్‌లో ఏర్పడిన గోతులు పూడ్చివేత

సమాజ హితం కోరేదే వేదం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ గోపాలకృష్ణ

బోట్‌క్లబ్: వేదం సమాజ హితాన్ని, శ్రేయస్సును కోరుకుంటుందని అందుకే వేదం ప్రతి ఒక్కరూ శ్రవణం చేయాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అన్నారు. శ్రీమద్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వసంతాల వేద సభ బుధవారం స్థానిక రామారావు పేటలో ఉన్న గాయత్రి మండపంలో పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి అధ్యక్షతన జరిగింది. తొలుత గాయత్రి మాత చిత్రపటం ముందు విశ్వనాథ గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. వేదాలు పరమార్థాన్ని వివరించారు. వేదం బోధించిన మార్గంలో పయనిస్తే అనేక ప్రయోజనాలను పొందగలమన్నారు. సనాతన వైదిక ధర్మాలు పాటించే వారిని గౌరవించడం మన అందరి ప్రథమ కర్తవ్యమన్నారు. భారత జ్యోతి అవార్డు గ్రహీత దత్తాత్రేయ వేద గురుకుల ప్రధానోపాధ్యాయులు గుల్లపల్లి శ్రీరామచంద్రమూర్తి ఘనపాఠి మాట్లాడుతూ వేద సభలు నిర్వహించడం ద్వారా సమాజానికి, దేశానికి ఎంతో క్షేమకరమన్నారు. పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి మాట్లాడుతూ త్వరలో కాకినాడలో భారీ ఎత్తున బ్రాహ్మణ గర్జన మహాసభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్ మాట్లాడుతూ వేద పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ వేద సభలో సమాజ లోకహితం కోరుకుంటూ వేద స్వస్తి చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు అయ్యగారి వెంకటేష్, నందమూరి వినోద్, వద్దిపర్తి సత్య మురళీరావు, భాను కుమార్, కప్పగంతుల వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. కంకణధారణ, పాదప్రక్షాలన, వస్త్ర సమర్పణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనుల పండువగా నిర్వహించారు.108 వెండి తులసీ దళాలతో స్వామివారికి అర్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు

కాకినాడ లీగల్: రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ)చేస్తున్న కృషి అభినందనీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలో న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐఎల్ఏ రాష్ట్ర మహాసభ పోస్టల్‌ను బుధవారం కాకినాడ బార్ అసోసియేషన్ హాల్‌లో సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శ చక్కపల్లి వీరభద్రరావు(చంటి) మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సదస్సులో చర్యలు తీసుకోవాలన్నారు. ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నైతికతను పెంపొందించడం కోసం తీసుకోవాల్సిన చర్యలు, బెంచ్ అండ్ బార్ సంబంధాల మెరుగు, న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై తదితరి అంశాలపై చర్యలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సారా రహిత వార్డులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

సామర్లకోట: పట్టణంలో సారా రహిత వార్డులుగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా బ్రౌన్‌పేట, బలుసులపేట, గాంధీనగర్ వార్డులకు సంబంధించి గ్రామ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో సారాతో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించామని, ఆయా కుటుంబాలకు చెందిన వారు సారా విక్రయాలు, తయారీకి దూరంగా ఉంటామని హామీ ఇచ్చారని సీఐ తెలిపారు. ఈ మేరకు ఆయా కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వానికి సూచించామని చెప్పారు. సారా విక్రయాలు చేసే వారి హామీ మేరకు గాంధీనగర్, బలుసులపేట, బ్రౌన్‌పేటలను సారా రహిత వార్డులుగా ప్రకటించామని సీఐ తెలిపారు. ఈ తరుణంలో సారా విక్రయాలు జరిగితే కేసులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్సై ఎం వీవీబీ కుమార్, హెచ్‌సీ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సనాతన ధర్మం ఎంతో విలువైంది



సూర్యకళామందిరంలో ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సనాతన ధర్మ ఎంతో విలువైందని సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో బుధవారం రాత్రి సరస్వతి గానసభ ఆధ్వర్యంలో సనాతన ధర్మం–శాశ్వత న్యాయం అంశంపై ఆయన 3వ రోజు ప్రసంగించారు. మన దేశంలో మూల విద్యలన్నీ తుంగలో తొక్కారనర్నారు. భారతీయ వ్యవస్థలో స్త్రీలు ఏ విధంగా గౌరవ మర్యాదలు ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రంలో సరస్వతీ గాన సభ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి పాల్గొన్నారు.

వైభవంగా పులిమేరు ముసలమ్మ తల్లి సంబరం



సంబరంలో ఆకట్టుకున్న కాళికాదేవి వేషాలు

పెద్దాపురం: పులిమేరు గ్రామ దేవత ముసలమ్మ తల్లి సంబరం బుధవారం వైభవంగా జరిగింది. ఏటా నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా వేకువ జాము నుంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి సంబరాన్ని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, తుమ్మల నాని, బుల్లియ్య తదితరులు ప్రారంభించగా పులిమేరు, గోరింట, గుడివాడ, దివిలి, చంద్రమాంపల్లి, చదలాడ, ఉలిమేశ్వరం గ్రామాలతో పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైన సంబర ఉత్సవంలో భాగంగా ఆయా దేవతామూర్తుల బళ్లవేషాలు, గరగలాట, బ్యాండ్‌మేళాం వంటి కార్యక్రమాలను చూపరులను ఆకటుకున్నాయి.

రైతు గుండె చెరువైంది!

- తగ్గని సుద్దగడ్డ వరద
- ముంపులో వరి పంటలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



తిమ్మాపురంలో నీట మునిగిన పంట పొలాలు



పిఠాపురం మండలంలో చెరువుగా మారిన పొలాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో సుద్దగడ్డకు వచ్చిన వరద ఉధృతి కొనసాగుతోంది. ఈ ఉధృతి తగ్గకపోగా ఇంకా పెరుగుతోంది. దీంతో పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువ రోజులు నీటిలో ఉండి పోవడంతో ఇప్పటికే నాట్లు పైకి లేచి పోవడంతోపాటు వరి దుబ్బులు కుళ్లి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉడ్చిన వరి పంటలు ఊడ్చిపెట్టుకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు, సుద్దగడ్డ తదితర ప్రధాన పంట కాలువలు పొంగి పొరుతుండడంతో పంట పొలాలు నీట మునిగి ఇప్పటి వరకు నాట్లు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని రైతులు వాపోతున్నారు. పిఠాపురం మండలంలో పి.తిమ్మాపురం, జములపల్లి, రాయవరం, రాపర్తి , గొల్లప్రోలు మండలంలో లక్ష్మీపురం, చేబ్రోలు, సీతానగరం తదితర గ్రామాల్లో వరి పంట బుదవారం నాటికి తగ్గుముఖం పట్ట లేదంటున్నారు. అయితే పంటలను పరిశీలించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పుడు ఒకే చోట పరిశీలించి వెళ్లి పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా నీట మునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను పట్టించుకోడం లేదని పిఠాపురం మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.